ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 43.0 । కనిష్ఠం : 31.0
ANDHRAJYOTHY
5
జోగుళాంబ గద్వాల జిల్లా వార్తలు
బుధవారం 1 మే 2024



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాజాపూర్, ఏప్రిల్ 30: మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిని దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో మృతి చెందాడు. ఎస్‌ఐ కేరవి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మండల కేంద్రానికి చెందిన వనపర్తి గోపాల్(65) ముఖ్య కూడలిలో రోడ్డు దాటుతుండగా జడ్చర్ల నుంచి హైదారాబాద్‌కు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దాంతో తలకు, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చనిపోయాడు. గోపాల్ కుమారుడు సురేందర్ కారు డ్రైవరుపై చర్యలు తీసుకోవాలని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పదిలోనూ..

బాలికలదే పైచేయి

- జోగులాంబ గద్వాలకు రాష్ట్రంలో 32వ స్థానం
- ఉమ్మడి జిల్లాలో నారాయణపేట ఫస్ట్.. గద్వాల లాస్ట్



10/10 జీపీఏ సాధించిన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం వెన్నచేడ్ ఆదర్శ పాఠశాల విద్యార్థిని పల్లవిని అభినందిస్తున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 30: పదో తరతగతిలో ఉమ్మడి జిల్లా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. ఫలితాలను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారులు మంగళవారం విడుదల చేశారు. ఇంటర్‌తో పాటు ఈ ఫలితాల్లోనూ బాలికలే పైచేయిగా నిలిచారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీల విద్యార్థులకు మెరుగైన ఫలితాలు వచ్చాయి. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు రాష్ట్ర స్థాయి 10/10 జీపీఏ సాధించారు. నారాయణపేట జిల్లా 93.13 శాతం ఉత్తీర్ణత సాధించి.. రాష్ట్రంలో 15వ స్థానంలో, ఉమ్మడి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. జోగులాంబ గద్వాల 81.38 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 32, ఉమ్మడి జిల్లాలో చివరి స్థానంలో నిలిచింది. మహబూబ్‌నగర్ జిల్లాలోని కేజీబీవీల్లో చదివిన విద్యార్థులు ఫలితాల్లో సత్తా చాటారు. జిల్లాలోని 14 కేజీబీవీల నుంచి 581 విద్యార్థినులు పరీక్ష రాయగా.. 546 మంది ఉత్తీర్ణత సాధించారు.

17 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత

మహబూబ్‌నగర్ జిల్లాలోని 17 పాఠశాలల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. అందులో ప్రభుత్వ వీహెచ్‌పీ పాఠశాల, కేజీబీవీలు ఐదు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 11 ఉన్నాయి.

జిల్లాల వారీగా ఫలితాల వివరాలు ఇలా..

జిల్లా	ఉమ్మడి స్థానం	రాష్ట్రంలో స్థానం	హాజరైన విద్యార్థులు	పాసైన విద్యార్థులు	శాతం
నారాయణపేట	1	15	7655	7129	93.13
నాగర్‌కర్నూల్	2	23	10,507	9621	91.57
మహబూబ్‌నగర్	3	28	12,673	11,338	89.47
వనపర్తి	4	29	6,888	5988	86.93
జోగుళాంబ గద్వాల	5	32	7,175	5839	81.38

పట్టు చీరలు ఎత్తుకెళ్తున్నారు

- కొనుగోలు పేరుతో దుకాణాల్లో చోరీలు
- ఇటీవల 10 చీరలను దుస్తుల్లో దాచుకొని వెళ్లిన మహిళ
- జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఆందోళన చెందుతున్న యజమానులు



దొంగలించిన పట్టుచీరలతో మహిళలు పారిపోతున్న కారు ఇదే..(ఫైల్)

గద్వాల క్రైం, ఏప్రిల్ 30 : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కిష్టారెడ్డి బంగ్లా కాలనీ పట్టు చీరల విక్రయాలకు ప్రసిద్ధి. ఈ ప్రాంతంలో పట్టుచీరలు అమ్మే దుకాణాలు వందల్లో ఉంటాయి. రెండు వేల నుంచి లక్ష రూపాయల విలువైన చీరలు ఇక్కడ లభిస్తాయి. చీరల కొనుగోలు కోసం వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఇక్కడికి వస్తూ ఉంటారు. ఇదే అదనుగా కొందరు కొనుగోలు నెపంతో దుకాణాలకు వస్తున్నారు. యజమానిని మాటల్లో పెట్టి చీరలను దుస్తుల్లో దాచుకొని ఉడాయిస్తున్నారు. ఇటీవల జరిగిన ఓ సంఘటన అందుకు నిదర్శనమని చెప్పొచ్చు. ఇక్కడి విఘ్నేశ్వర్ శారీహౌస్‌కు ఓ మహిళ ఇద్దరు పురుషులతో కలిసి వచ్చింది. ఆ సమయంలో దుకాణం యజమాని వినోద్ పనిమీద బయటకు వెళ్లాడు. ఆయన తాత లక్ష్మీనారాయణ దుకాణంలో కూర్చున్నారు. ఇద్దరు మగవారు అతడిని మాటల్లో పెట్టారు. ఆ మహిళ దుకాణం లోనికి వెళ్లింది. 10 పట్టు చీరలను తన దుస్తుల్లో దాచుకొని బయటకు వచ్చింది. తనకు చీరలు నచ్చలేదని, కొత్త స్టాక్ వచ్చాక వచ్చి కొనుగోలు చేస్తామని చెప్పి ముగ్గురూ కారెక్కి వెళ్లి పోయారు. అదే సమయంలో యజమాని వినోద్ వచ్చాడు. జరిగిన విషయాన్ని తాత అతడికి వివరించాడు. దీంతో సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా మహిళ చీరలను ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. వెంటనే ద్విచక్ర వాహనంతో కారును వెంబడించాడు. గమనించిన కారులోని మహిళ అక్కడొకటి, ఇక్కడొకటి మూడు చీరల ను బయటకు విసిరేసింది. వినోద్ బైక్‌ను ఆపి చీరలను తీసుకుంటుండగా, కారు వేగంగా వెళ్లిపోయింది. దీంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీస్ అధికారులు స్పందించి నిఘా పెంచాలని, చీరల దొంగతనాలు అరికట్టేందుకు కృషి చేయాలని దుకాణాల యజమానులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం



జిల్లా కేంద్రంలో చోరీలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఇటీవలే పలు దొంగతనాలను ఛేదించి నిందితులను రిమాండుకు తరలించాం. చీరల చోరీ కేసును కూడా త్వరలోనే ఛేదిస్తాం. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరుగకుండా చర్యలు తీసుకుంటాం. చోరీ అయిన చీరలు, సొత్తును రికవరీ చేసేందుకు కృషి చేస్తాం.

- రితి రాజ్, ఎస్పీ, గద్వాల

గతంలోనూ పలు సంఘటనలు

ఇలాంటి సంఘటనలు గతంలోనూ జరిగినట్లు దుకాణాల యజమానులు చెప్తున్నారు. శిరిడీసాయి శారీ హౌస్‌లో 10 పట్టు చీరలు, సంతోష్‌కుమార్ శారీ హౌస్‌లో ఆరు, శ్రీలత గద్వాల శారీహౌస్‌లో ఎనిమిది, సునిత గద్వాల సారీ హౌస్‌లో ఎనిమిది, రామ్‌ప్రసాద్ శారీ హౌస్‌లో 10 పట్టుచీరలు చోరీకి గురైనట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. వాటి విలువ లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు. రాయలసీమకు చెందిన వారే చోరీలకు పాల్పడు తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. వినోద్ వెంబడించిన కారు కూడా కర్నూల్ వైపే వెళ్లిందని వారు తెలిపారు.

ఐదున రాహుల్ గాంధీ రాక

ఎర్రవెల్లిలో నిర్వహించనున్న బహిరంగ సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్



ఎర్రవల్లి, ఏప్రిల్ 30: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల ఐదో తేదీన ఎర్రవల్లి మండల కేంద్రంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతారని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన ఎర్రవల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లడారు. రాహుల్ సభను విజయవంతం చేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల నుంచి అధిక మెజారిటీ ఇవ్వాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజాపాలనలో భాగంగా చేపట్టిన ఆరు గ్యారెంటీలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. దురదృష్టవశాత్తు తాను ఓటమి పాలైనా.. కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడుతానని చెప్పారు. అంతకు ముందు బహిరంగ సభా స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎర్రవల్లి మాజీ సర్పంచ్ జోగుల రవి, మండల అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, నాయకులు లక్ష్మీనారయణరెడ్డి, సోమనాద్రి, నీలి శ్రీను, మాణిక్యరెడ్డి, మెడికల్ మద్దిలేటి, నరసింహ, వెంకటేష్, బజారన్న, శ్యామ్ సుందర్, మధునాయుడు పాల్గొన్నారు.

రుణమాఫీ అమలు చేస్తాం

- ఎన్నికల కోడ్‌తో అమలు కాని పథకాలు
- పార్లమెంటు సీటు గెలిచి రాహుల్‌కు బహుమతిగా ఇద్దాం
- ముఖ్య కార్యకర్తల సమావేశంలో డాక్టర్ మల్లురవి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మల్లు రవి

గద్వాల, ఏప్రిల్ 30 : 'కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతుంది. రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఆగస్టు 15న చేసి తీరుతామని స్వయంగా ముఖ్యమంత్రి ప్రకటించారు' అని నాగర్‌కర్నూల్ పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ మల్లురవి అన్నారు. గద్వాల పట్టణంలోని సీఎన్‌జీ ఫంక్షన్ హాల్‌లో జడ్పీ చైర్‌పర్సన్ సరిత ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను హామీగా ఇచ్చిందని, అందులో కొన్నింటిని అమలు చేశామని ఎలిపారు. మిగిలిన పథకాలను అమలు చేయడానికి సిద్ధమవుతుండగా, ఎమ్మెల్సీ, ఆ తర్వాత పార్లమెంటు ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో సాధ్యం కాలేదని వివరించారు. కొందరు మూర్ఖులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వివరించారు. మహిళలు ఉచితంగా బస్సులో ప్రయాణిస్తున్నది చూడటం లేదా అని ప్రశ్నించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీని అమలు చేస్తున్నామని, ఉచిత విద్యుత్ అమలు చేశామని ఆయన గుర్తు చేశారు. ఆగస్టు 15న రుణమాఫీని అమలు చేస్తామని ప్రతీ మీటింగ్‌లో ముఖ్యమంత్రి చెప్తున్నప్పటికీ కొందరు తప్పుదారి పట్టించేలా మాట్లాడుతున్నారని, వారికి ఎన్నికలలో బుద్ధి చెప్పాలని సూచించారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అక్కడ కూడా ఐదు గ్యారెంటీ పథకాలను అమలు చేసి తీరుతామని అన్నారు. ఇందులో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలంటే, ప్రతీ కార్యకర్త సైనికుడిగా పని చేసి గెలుపునకు కృషి చేయాలని కోరారు. నాగర్‌కరూల్‌లో గెలిచి రాహుల్ గాంధీకి గిఫ్ట్‌గా ఇద్దామని కోరారు. సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, మునిసిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, గట్టు తిమ్మప్ప, శంకర్, మధుసూదన్‌బాబు, గట్టు కృష్ణమూర్తి, అమరవాయి కృష్ణారెడ్డి, లత్తిపురం వెంకట్రామిరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కార్యకర్తలు

పార్టీలో చేరిన బీఆర్‌యస్ నాయకులు

డాక్టర్ మల్లురవి సమక్షంలో వివిధ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ధరూర్ మండల కేంద్రానికి చెందిన సత్యన్న, శ్రీనివాసులు, లాజర్, లైటర్ చిన్న, తిమ్మప్ప, గోవింద్, గోవర్ధన్‌లతో పాటు, మల్దకల్ మండలం తాటికుంట గ్రామానికి చెందిన మల్దకల్ గైడ్, కుర్వ బుడ్డన్న, భీమన్న, నర్సింహులు, రామన్నలతో పాటు 100 మంది పార్టీలో చేరారు. వారికి ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి కండువా కప్పి ఆహ్వానించారు.

మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

- నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకులు రుచేస్ జైవన్షీ

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని, ఆ దిశగా వారు విధులు సమర్థవంతంగా నిర్వహించాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకుడు రుచేస్ జైవన్షీ, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ సూచించారు. మంగళవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మైక్రో అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రుచేస్ జైవన్షీ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. అందుకు సంబంధించి శిక్షణ కార్యక్రమం ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. పోలింగ్ రోజు నిర్వహించాల్సిన విధులను వివరించారు. అధికారులంతా కలిసి ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు. కలెక్టర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ పోలింగ్ రోజున బూత్‌లలో ఎన్నికల ప్రక్రియ జరుగుతున్న విధానాన్ని పరిశీలించాలన్నారు. ఈవీఎం కంట్రోల్ యూనిట్ బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్ల సీల్ చేసే విషయాన్ని అబ్జర్వ్ చేయాలన్నారు. పోలింగ్ ముగిశాక ఈవీఎంలను సరిగా సీల్ చేశారా లేదా?, ఫారంలు సరిగా నింపారా లేదా? అనే అంశాన్ని రిపోర్టులో నమోదు చేయాలని సూచించారు. అనంతరం మాస్టర్ ట్రైనర్స్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మైక్రో అబ్జర్వర్లకు విధి విధానాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్, ఎన్నికల ట్రైనింగ్ అధికారి గోపాల్, మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు

- బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



పెద్దకొత్తపల్లిలో ప్రచారం చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

పెద్దకొత్త పల్లి, ఏప్రిల్ 30 : కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు మోసపూరితమైనవని నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని దేవునితిర్మలాపూర్ గ్రామంలో వేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెద్దకొత్తపల్లి బస్టాండ్ చౌరస్తాలో టీ హోటళ్లు, పండ్ల దుకాణాలు, వ్యాపార సముదాయాల యజమానులను కలిశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఐదు గ్యారెంటీలతో కేంద్రంలో అధికారంలోకి రావాలని చూస్తుందని ఆయన విమర్శించారు. జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పి కారు గుర్తుకు ఓటు వేసి తనను ఆశీర్వదించాలని కోరారు. కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను నాగర్‌కర్నూల్ ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీయువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తారని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజవకర్గ నాయకులు రంగినేని అభిలాష్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు గణేష్‌రావు, సింగిల్ విండో చైర్మన్ కట్ట రాజేందర్‌గౌడ్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నాగరాజు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎస్.వెంకటయ్య, మాజీ సర్పంచులు శ్రీనివాస్‌రెడ్డి, జక్కుల నరసింహ, పవన్‌కుమార్‌శర్మ, నాయకులు బెట్టరి నాగరాజు, రమేష్‌రెడ్డి, పి.యాదగిరి, పి.విజయ్య, ఏదుల కుర్మయ్య, శ్రీకృష్ణాచారి, శ్రీనివాసులు, రాముయాదవ్, అశోక్‌రెడ్డి, వంశీగౌడ్, బాబురావు పాల్గొన్నారు.

కార్మికుల వెట్టిచాకిరి

- అమలు కాని పని గంటలు.. కనీస వేతన చట్టాలు
- పరిశ్రమల్లో స్థానికులకు దక్కని ఉపాధి
- ఉమ్మడి జిల్లాలో సంఘటిత రంగ కార్మికులు లక్ష మంది..
- నేడు మేడే



నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు

పాలమూరు, ఏప్రిల్ 30: చట్టాలు సరిగా అమలు కాకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని కార్మికులు అవస్థలు పడుతున్నారు. పని గంటలు, కనీస వేతనాలు అమలు కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలమూరు అంటే వలస కార్మికులకు మారుపేరు. రాష్ట్రం, దేశం, ప్రపంచంలో ఎక్కడ ఏ ప్రాజెక్టు కట్టినా అందులో పాలమూరు కూలీలు ఉంటారని పేరుండేది. ఉపాధి కోసం జిల్లా ప్రజలు పొట్ట చేతపట్టుకొని వలస వెళ్లడం అనాదిగా వస్తోంది. నేటికీ మహబూబ్‌నగర్, నారాయణపేట నుంచి ముంబయి బస్సు రోజూ కార్మికులతో నిండుగా వెళ్లడం పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అసంఘటిత రంగ కార్మికుల పరిస్థితి ఇలా ఉంటే.. సంఘటిత రంగాలైన బీడీ, హమాలీ, విద్యుత్, గ్రామ పంచాయతీ, కేజీబీవీ, ఆర్‌డబ్ల్యూఎస్, రైస్‌మిల్, మునిసిపాలిటీల్లో పని చేసే కార్మికుల ఆవేదన మరోలా ఉంది. కొన్ని విభాగాల్లో అగ్రిమెంట్ ప్రకారం ఏడాదికోసారి వేతనాలు పెంచాల్సి ఉన్నా.. పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వం కార్మిక శాఖ తరఫున గుర్తించిన కార్మికులు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు లక్ష మంది ఉండగా.. నిర్మాణ రంగంతో పాటు షాపులు, హోటళ్లు, ఇటుక బట్టీల్లో పని చేసే వారు అనధికారికంగా మూడు లక్షలమంది వరకు ఉంటారని తెలుస్తోంది.

అమలు కాని వలస నివారణ చట్టం

వలస వెళ్లిన చోట ప్రమాదాలు, వేధింపులు, ఇతర సమస్యలకు గురవుతున్న కార్మికులకు వలస నివారణ చట్టం అమలు కాకపోవటంతో కష్టాలు తప్పటం లేదు. ఒక గ్రామం నుంచి కార్మికులను వలస తీసుకుపోతుంటే వారిని ఎక్కడికి తీసుకెళ్లి పని చేయించాలని అనుకుంటున్నారో గ్రామ పంచాయతీలో నమోదు చేయాలి. అలా నమోదు చేస్తే ఏదైనా ఇబ్బంది కలిగితే ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఆపదలో ఉన్న వారిని ఆదుకునే అవకాశం ఉంటుంది. కానీ అలా చేయడం లేదు. ఉమ్మడి జిల్లాలో బీడీ కార్మికుల సంఖ్య అధికంగా ఉంది. వారికి రెండేళ్లకోసారి వేతన చట్టాన్ని సవరించాల్సి ఉంది. కానీ యజమానులు అమలు చేయడం లేదు. ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నవారు మరో పని చేసుకోలేకపోతున్నారు. వీరు నెలలో 24 రోజులు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

వలస కార్మికులతో వెట్టి చాకిరి

తక్కువ వేతనంతో వలస కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకోవడం అన్యాయం. కార్మికులందరికీ కనీస వేతనం ఇవ్వాలి.

- సి.వెంకటేష్, ఐఎఫ్‌టీయూ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు

చట్టాలు అమలు కావడం లేదు

సంఘటిత, అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం మార్చడం కార్మికులకు ద్రోహం చేయడమే. కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్‌కోడ్‌లను తేవడం క్షమించరానిది.

- రాములు యాదవ్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు

స్థానికులకు ఉపాధి కరువైంది

మహబూబ్‌నగర్‌లోని హోటల్స్ పిస్తాహౌస్, ఆస్పత్రులు, పరిశ్రమలు, రైస్ మిల్స్, సీయంఆర్, చెన్నై షాపింగ్‌మాల్స్‌లో స్థానికులను పెట్టుకోవటంలేదు. వలస కార్మికులకు ఏమైనా ప్రమాదం జరిగితే రాత్రికి రాత్రే ఎంతో కొంత ఇచ్చి పంపొచ్చని అలా చేస్తున్నారు.

- నల్లవెల్లి కురుమూర్తి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

వ్యక్తి అదృశ్యం, కేసు నమోదు

మిడ్జిల్, ఏప్రిల్ 30 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన నీలకంఠం కన్పించడం లేదని భార్య సుజాత స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై చంద్రమోహన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఏప్రిల్ 25వ తేదీన సెంట్రింగ్ పని ఉందని హైదరాబాద్‌కు వెళ్లి వస్తానని భార్యతో చెప్పి నీలకంఠం బయటకు వెళ్లిపోయాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో భార్య భర్తకు ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చింది. ఆందోళన చెందిన ఆమె బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రాజాపూర్ మండలంలో బాలిక..

రాజాపూర్, ఏప్రిల్ 30 : మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(17) సోమవారం సాయంత్రం అదృశ్యమైంది. ఎస్సై రవి తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలో సంతకు వచ్చిన బాలిక రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఆమె ఆచూకీ కోసం వెతికారు. బాలిక జాడ కానరాకపోవడంతో మంగళవారం బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బ్యాంక్ సిబ్బంది విధులకు ఆటంకం

▸▸ వ్యక్తికి రిమాండ్

ధరూరు, ఏప్రిల్ 30 : బ్యాంకు సిబ్బంది విధులకు ఆటంకం కల్గిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండలం రేవులపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన డోలు సూరి అలియాస్ సురేంద్ర సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు గ్రామంలోని ఇండియన్ బ్యాంక్‌కు వెళ్లాడు. పాస్‌బుక్ తీసుకువెళ్లకుండా వెళ్లిన అతను డబ్బులు ఇవ్వాలని సిబ్బందిని కోరగా అందుకు వారు నిరాకరించారు. పాస్‌బుక్ తీసుకురండని క్యాషియర్ సూచించారు. దీంతో సురేంద్ర బ్యాంకు సిబ్బందితో దురుసుగా ప్రవర్తిస్తూ వాగ్వాదానికి దిగాడు. అనంతరం అసిస్టెంట్ మేనేజర్ పార్వతమ్మతో కూడా గొడవపడి విధులకు ఆటంకం కలిగించాడు. ఈ విషయమై అసిస్టెంట్ మేనేజర్ ధరూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

రాష్ట్ర స్థాయి కిక్‌బాక్సింగ్ టోర్నీకి జిల్లా క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 30 : వనపర్తి జిల్లాలో నేటి నుంచి జరగనున్న రాష్ట్ర స్థాయి కిక్‌బాక్సింగ్ టోర్నీకి ఆర్కే స్పోర్ట్స్ విద్యార్థులు ఎంపికయ్యారు. మంగళవారం మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ రాజేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శాంత అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కిక్‌బాక్సింగ్ టోర్నీ పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ 22 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

'పది'లో
సత్తా చాటిన న్యూరిషి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 30 : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని న్యూరిషి పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. మంగళవారం విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 11 మంది విద్యార్థులు 10 బై 10 జీపీఏ సాధించారు. మరో 11 మంది విద్యార్థులు 9.8 జీపీఏ సాధించారు. తొమ్మిది మంది విద్యార్థులు 9.7 జీపీఏ, 19 మంది 9.5 జీపీఏ సాధించగా 82 మంది విద్యార్థులు 9. జీపీఏ సాధించారు. మొత్తం 98.9 శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

లిటిల్ స్కాలర్స్ విద్యార్థుల జయభేరి


విద్యార్థులను అభినందిస్తున్న లిటిల్ స్కాలర్ పాఠశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 30 : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ విద్యార్థులు జయభేరి మోగించారు. పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు 10 జీపీఏ, నలుగురు విద్యార్థులు 9.8 జీపీఏ, 26 మంది 9.7 జీపీఏ నుంచి 9. జీపీఏ సాధించి వందశాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించారు. జలజం సత్యనారాయణ ఆలోచన, ఆశయాలతో ముందుకు సాగుతున్నట్లు విద్యార్థులు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు పాఠశాల యాజమాన్యం పేర్కొన్నారు.

రెయిన్‌బో విద్యార్థుల జయకేతనం


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి


మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఏప్రిల్ 30 : జిల్లా కేంద్రంలోని రెయిన్‌బో హైస్కూల్ విద్యార్థులు మంగళవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో జయకేతనం ఎగురవేశారు. పాఠశాలకు చెందిన మన్నబింత్ మహమ్మద్, సయ్యద్ మిస్బాఉద్దిన్, అనిమిత్ ప్రీతం, మెతుకు శైలజ, అందే రోహిత్, ముసలి సాయికాంత్‌రెడ్డి, కె.శ్రీనాథ్‌రెడ్డి, ఆర్.పల్లవి, ఫాతిమాఫిదేర్, ఎం.నక్షత్ర, జి.సాయిశ్రీరెడ్డి, వి.నందిని, బి.వైష్ణవిలు 10 బై 10 జీపీఏ సాధించి సత్తా చాటారు. 9.8 జీపీఏ తొమ్మిది మంది, 9.7 జీపీఏ ఐదుగురు, 9.5 జీపీఏ ఐదుగురు, 9.3 జీపీఏ ఆరుగురు విద్యార్థులు సాధించారు. 9.2 ఎనిమిది మంది, 9. జీపీఏ ఆరుగురు సాధించారు. 90శాతం మంది విద్యార్థులు 8. జీపీఏ సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మమత, వైస్ ప్రిన్సిపాల్ నరేష్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

మండుతున్న ఎండలు


▸▸ గద్వాల జిల్లా ఇటిక్యాలలో 44.7 డిగ్రీలు


మహబూబ్‌నగర్‌లోని సుభాష్‌చౌరస్తాలో ఎర్రటి ఎండలో తాటిముంజలు అమ్ముకుంటున్న దృశ్యం


ఎప్పుడూ రద్దీగా కనబడే అప్పనపల్లి ఫ్లైఓవర్ నిర్మానుష్యం


పాలమూరులో ఎండ వేడిమికి తలపై రుమాలుతో వెళుతున్న వాహనదారులు


నిర్మానుష్యంగా మారిన వనపర్తి పట్టణంలోని కొత్తకోట రోడ్డు


అప్పనపల్లి సమీపంలో చెట్టు నీడన గొర్రెలు కాస్తున్న కాపరి

వడదెబ్బకు వృద్ధుడి మృతి

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 30 : ఎండలు విపరీతంగా ఉండడంతో ఓ వృద్ధుడు వడదెబ్బకు గురై మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉమామహేశ్వర్‌రావు(60) హైదరాబాద్‌లో నివాసం ఉంటాడు. కొన్నిరోజుల క్రితం స్వగ్రామమైన గంట్రావుపల్లి గ్రామానికి వచ్చి మంగళవారం ఉదయం తన వ్యవసాయ పొలం చూసుకోవడానికి వెళ్లాడు. పొలం దగ్గరే ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండడంతో వడదెబ్బకు గురై వాంతులు చేసుకుని మృతి చెందాడు. మృతునికి భార్య ప్రేమలత, ఒక కూతురు ఉంది.

మహబూబ్‌నగర్/నారాయణపేట/నాగర్‌కర్నూల్ టౌన్/గద్వాల/వనపర్తి అర్బన్, ఏప్రిల్ 30 : పాలమూరు అట్టుడుకుతోంది.. భానుడి ప్రతాపానికి జనం బేజారవుతున్నారు... బయటకు వెళ్ళాలంటేనే వణకాల్సి వస్తోంది.. జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం, ఎర్రటి ఎండ సలసలకాలే రోడ్లపై వెళ్లాలంటేనే భయపడుతున్నారు. తప్పక ఎండకు బయటకు వెళితే మాడు పగులుతోంది. రికార్డ్ స్థాయిలో జిల్లాలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాలలో 44.7 డిగ్రీలు, గద్వాలలో 44.5, కేటీదొడ్డిలో 44.3, ధరూర్‌లో 44.2, అలంపూర్‌లో 43.3, రాజోలిలో 43.2, మల్దకల్‌లో 43, వడ్డేపల్లిలో 42.9, అయిజలో 42.9, ఉండవెల్లిలో 42.2, మానవపాడు 41.2, గట్టులో 40.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

మహబూబ్‌నగర్ జిల్లాలోని సీసీకుంటలో 44.3 డిగ్రీలు నమోదుకాగా, కోయిలకొండలో 44.1 డిగ్రీలు నమోదైంది. దేవరకద్రలో 43.8, బాలానగర్‌లో 43.6, అడ్డాకుల, జడ్చర్లలో 43.5, మిడ్జిల్‌లో 43.4, రాజాపూర్‌లో 43.2, మూసాపేటలో 43.1, మహబూబ్‌నగర్, మహ్మదాబాద్‌లో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకాగా జిల్లాలో అత్యల్పంగా భూత్పూర్‌లో 42 డిగ్రీలు నమోదైంది.

వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయిపల్లిలో 43.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పెబ్బేరులో 43.5, ఆత్మకూర్‌లో 43.2, శ్రీరంగాపూర్‌లో 43.0, పెద్దమందడిలో 42.9, చిన్నంబావి, పాన్‌గల్‌లో, అమరచింతలో 42.7, వనపర్తిలో 42.4, మదనాపూర్‌లో 42.3, ఘనపూర్‌లో 42.1, గోపాల్‌పేటలో 41.9, రేవల్లిలో 41.1, వీపనగండ్లలో 40.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలో 43.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కల్వకుర్తిలో 43.2, బిజినేపల్లిలో 43.1, వంగూరులో 43.0, అచ్చంపేటలో 42.7, ఉప్పునుంతలలో 42.4, తెల్కపల్లిలో 42.2, తాడూరులో 41.9, పెద్దకొత్తపల్లిలో 41.7, పదరలో 41.5, తిమ్మాజిపేటలో 40.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నారాయణపేట జిల్లా నర్వలో 43 డిగ్రీలు, కోస్గి, మక్తల్‌లో 42 డిగ్రీలు, కృష్ణలో 41 డిగ్రీల ఉష్ణోగ్రతతో వడగాల్పులు వీచడంతో ఇబ్బందులు పడ్డారు.

కల్లు తాగించి.. ఆపై హత్య

▸▸ మహిళను హత్య చేసిన నిందితుడి అరెస్టు
▸▸ వివరాలు వెల్లడించిన ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 30 : కల్లు తాగించి మహిళను శారీరకంగా అనుభవించాడు. ఆపై తనతో శారీరకంగా గడపాలని కోరగా నిరాకరించడంతో హత్య చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. ఈ సందర్భంగా హత్యకు సంబంధించిన వివరాలు మంగళవారం ఎస్పీ వెల్లడించారు. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల కేంద్రంలోని లక్ష్మీనగర్‌లో ఈనెల 25న అర్ధరాత్రి ఎనికెల లక్ష్మప్ప, సవిత(40) అనే మహిళను హత్య చేసి ఇంట్లో ఉంచాడు. రెండు రోజుల తరువాత వచ్చి డయల్ 100కు ఫోన్ చేసి తన ఇంట్లో ఓ మహిళను హత్య చేసి వేశారని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేటకు తరలించారు. మృతురాలి తల్లి కోలుకుందే సాయమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా లక్ష్మప్పకు కల్లు తాగే అలవాటు ఉందని, మండల కేంద్రంలోని లక్ష్మీనగర్‌లో నర్సింహులుగౌడ్ కల్లు దుకాణంలో కల్లు తాగుతుండగా ఈనెల 25న ఉదయం 11 గంటల ప్రాంతంలో సవిత అనే మహిళ చిన్న పాపతో కల్లు దుకాణానికి వచ్చింది. లక్ష్మప్ప దగ్గరికి వెళ్లి నా దగ్గర డబ్బులు లేవు.. కల్లు పోయించు అని అడిగింది. దీంతో లక్ష్మప్ప సవితకు కల్లు పోయించాడు. అనంతరం ఒకరి ఫోన్ నెంబర్ ఒకరు తీసుకున్నారు. తరువాత ఇద్దరు కలిసి లక్ష్మప్ప ఇంటికి వెళ్లారు. లక్ష్మప్ప తన కోరికను తీర్చుకోవాలనే ఆలోచనతో ఈ పాపను వదిలి వస్తే మళ్లీ కల్లు తాపిస్తానని చెప్పడంతో సవిత తన కూతురిని పక్కింట్లో వదిలి లక్ష్మప్ప ఇంటికి వచ్చింది. ఆమెకు కల్లు తాపి తనతో గడపమని అడగగా ఆమె ఒప్పుకోకపోవడంతో బలవంతంగా అనుభవించాడు. కొద్దిసేపటికి మరలా అనుభవించడానికి చూడగా ఆమె ఒప్పుకోకపోవడంతో కోపంతో గొడ్డలి కర్రతో కొట్టాడు. ఆమె చనిపోయిందని నిర్ధారణ చేసుకున్న తరువాత ఆమె సెల్‌ఫోన్ పొలంలోకి విసిరేశాడు. ఆ తరువాత లక్ష్మప్ప తన అక్క కొడుకు నిశ్చితార్థం కోసం కర్ణాటకలోని క్యాసారం గ్రామానికి 26వ తేదీ శుక్రవారం తెల్లవారుజామున శవాన్ని తన ఇంట్లోనే ఉంచి వెళ్లిపోయాడు. మరుసటి రోజు సాయంత్రం దామరగిద్దలో జోగు బాలప్ప అనే వ్యక్తి చనిపోవడంతో అక్కడ రాత్రి ఉండి ఉదయం ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఉన్న శవం నుంచి వాసన రావడంతో డయల్ 100కు ఫోన్ చేసి, ఇంట్లో ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి మృతదేహాన్ని ఇంట్లో వేశారని చెప్పారు. పోలీసులు లక్ష్మప్పను విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకొని, సవితను చంపడానికి ఉపయోగించిన గొడ్డలి కర్రతో పాటు సెల్‌ఫోన్‌ను చూపించాడు. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకొని లక్ష్మప్పను అరెస్టు చేశారు. కేసు ఛేదించడంతో కృషి చేసిన డీఎస్పీ లింగయ్య, సీఐ శివశంకర్, ఎస్సై వసంత, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.


మహిళ హత్య వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

ఇంటికి నిప్పు

▸▸ భాగ పరిష్కారం చేయడం లేదని కుమారుడి ఘాతుకం
▸▸ తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు

గద్వాల క్రైం, ఏప్రిల్ 30 : ఇంటిని భాగపరిష్కారం చేయడం లేదనే విసుగుతో తాగిన మైకంలో ఇంటికి నిప్పు పెట్టాడో కుమారుడు. ఈ ఘటనలో ఇల్లు దగ్ధమై రూ.ఐదు లక్షల ఆస్తి నష్టం సంభవించింది. ప్రమాదానికి కారణమైన కుమారుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బీడీ కాలనీలో చోటు చేసుకున్న ఈ ఘటనపై ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలో నివాసముంటున్న కమురున్నీసాకు ముగ్గురు కుమారులు ఉన్నారు. రెండో కుమారుడైన మహ్మద్ హబీబ్ ఇంటిని భాగపరిష్కారం చేయాలని కొంతకాలంగా తల్లిని, సోదరులిద్దరినీ ఒత్తిడికి గురి చేస్తున్నాడు. కొంతకాలం తర్వాత చేస్తానని తల్లి వాయిదా వేస్తూ వచ్చింది. ఈ క్రమంలో సోమవారం రాత్రి మద్యం తాగి వచ్చిన మహ్మద్ హబీబ్ ఇంట్లో అందరూ నిద్రిస్తుండగానే పెట్రోల్ పోసి ఇంటికి నిప్పు పెట్టాడు. మంటలు వ్యాపించడంతో ఇంట్లో నిద్రిస్తున్న తల్లితో పాటు, అన్న మహమ్మద్ ఇలియాస్ కుటుంబం, తమ్ముడు మహ్మద్ ఫయాజ్ కుటుంబం ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు. దీంతో ఇంట్లో ఉన్న నగదు, వస్తు సామగ్రి, పాస్‌పోర్టులు అన్నీ దగ్ధమయ్యాయి. ప్రమాదంలో రూ.ఐదు లక్షల ఆస్తి నష్టం సంభవించిందని ఇలియాస్, ఫయాజ్‌లు తెలిపారు. ఘటనకు కారణమైన హబీబ్‌పై చర్యలు తీసుకోవాలని తల్లి, ఇద్దరు కుమారులు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


అగ్నికి ఆహుతైన ఇంట్లోని వస్తువులు


బీరువాలో కాలిపోయిన దుస్తులు

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

అచ్చంపేట టౌన్, ఏప్రిల్ 30 : ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని కూరగాయల మార్కెట్‌బజార్‌లో చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకులు, కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన సాయిసంధ్య(26) నాలుగేళ్ల క్రితం పట్టణానికి చెందిన ఉమాశంకర్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. గమనించిన కాలనీవాసులు విషయాన్ని భర్త ఉమాశంకర్‌కు తెలుపగా ఆయన భార్యను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతురాలికి మూడు సంవత్సరాల పాప ఉంది. ఘటనపై ఎస్సై రామును సంప్రదించగా మృతికి గల కారణాల తెలియాల్సి ఉందని చెప్పారు.


సాయిసంధ్య (ఫైల్)

బావిలో పడి మహిళ మృతి


దేవమ్మ (ఫైల్)

వనపర్తి రూరల్, ఏప్రిల్ 30 : వ్యవసాయ బావిలో పడి మహిళ మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా పరిధిలోని కడుకుంట్ల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మరి దేవమ్మ(55) గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. ఆమెకు ఇద్దరు కుమారులు ఉండగా ఒక కుమారుడు హైదరాబాద్‌లో ఉంటున్నాడు. మరో కుమా రుడు అదే గ్రామంలో ఉంటున్నాడు. రోజు మాదిరిగా సోమవారం కూలీ పనులకు వెళ్లిన దేవమ్మ సాయంత్రం ఇంటికి వచ్చింది. మంగళవారం తెల్లవారుజామున తన వ్యవసాయ బావిలో పడి మృతి చెందినట్లు గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దేవమ్మ మృతికి గల కారణాలు తెలియరాలేదు. ఈ విషయంపై రూరల్ ఎస్సై జలంధర్‌రెడ్డిని వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

అమీర్‌పేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌నగర్‌లోని ఓయో హోటల్‌లో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సోమవారం రాత్రి రెండు గంటల ప్రాంతంలో ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటకు సంబంధించి వివరాలను ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన హేమంత్(28) వ్యాపారి. అదే గ్రామానికి చెందిన ఓ యువతి, హేమంత్ కొద్ది కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇరువురు కలిసి హైదరాబాద్‌లోని ఓ శుభకార్యానికి హాజరై అనంతరం ఎస్ఆర్‌నగర్‌లోని ఓయో హోటల్‌లో గదిని అద్దెకు తీసుకున్నారు. తమ వెంట తెచ్చుకున్న మద్యం తాగి హేమంత్ రాత్రి 2 గంటల ప్రాంతంలో బాత్‌రూంకు వెళ్లి ఎంతకి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చి సదరు యువతి వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే తన సోదరుడు వంశీకృష్ణ, స్నేహితులకు ఫోన్ చేసి చెప్పింది. హేమంత్‌ని మంచంపై పడుకోబెట్టి 108కు ఫోన్ చేయగా, సిబ్బంది వచ్చి పరీక్షించి హేమంత్ మృతి చెందినట్టు చెప్పారు. మృతుడి తల్లి హేమలత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


హేమంత్ (ఫైల్)

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

రాజాపూర్, ఏప్రిల్ 30 : ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకొని చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై రవి తెలిపిన వివరాల ప్రకారం.. బాలానగర్ మండలం జాలుగడ్డతండా గ్రామ పంచాయతీ పలుగులగడ్డ తండాకు చెందిన శివమ్మ(36) కుటుంబంలో తలెత్తిన ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై సోమవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. గమనించిన కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి అక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ఫీజు గడువుకు రేపే ఆఖరి తేదీ

వనపర్తి రూరల్, ఏప్రిల్ 30 : ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు మే రెండవ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మద్దిలేటి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులకు మే 24వ తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మిడ్జిల్, ఏప్రిల్ 30 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని నేషనల్ దాబా దగ్గర ఏప్రిల్ 23వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ అనురాధ(35) మృతి చెందినట్లు కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్సై ఎస్సై చంద్రమోహన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపూర్ మండలం ఈద్గాన్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు, అతని భార్య అనురాధలు బైక్‌పై పని నిమిత్తం ఏప్రిల్ 23వ తేదీన జిల్లా కేంద్రానికి వెళ్లి అదేరోజు తిరుగు ప్రయాణంలో ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో జడ్చర్ల పట్టణంలోని జాతీయ రహదారి నేషనల్ దాబా పరిసర ప్రాంతంలో రోడ్డుపై అడ్డుగా వస్తున్న వ్యక్తిని శ్రీనివాసులు బైక్ ఢీకొనడంతో అతనితో పాటు, భార్య అనురాధ కింద పడ్డారు. ప్రమాదంలో శ్రీనివాసులు కుడిచేతికి బలమైన గాయం కాగా, అనురాధకు చెవి, ముక్కు నుంచి తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే చికిత్స కోసం జిల్లా కేంద్రానికి తరలించగా అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం డాక్టర్ల సలహా మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం అనురాధ మృతి చెందింది. శ్రీనివాసులు సోదరుడు కృష్ణకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వనపర్తి రూరల్, ఏప్రిల్ 30 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన వనపర్తి జిల్లా పరిధిలోని అంజనగిరి గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాన్‌గల్ మండలం అన్నారం గ్రామానికి చెందిన రాజు తన సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై తన కూతురిని తీసుకుని వనపర్తికి వస్తున్నాడు. అంజనగిరి గ్రామ శివారుకు రాగానే ఎదురుగా అంజనగిరి తండాకు చెందిన రాజునాయక్ వనపర్తి నుంచి ద్విచక్ర వాహనంపై తన తండ్రి సేవ్యానాయక్‌ను తీసుకుని వస్తు తండాకు వెళ్లే మలుపు వద్ద ఒకదానికొకటి ఢీకొన్నాయి. ప్రమాదంలో రాజుకు, సేవ్యానాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన ఇద్దరూ వనపర్తిలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స తీసుకున్నారు. ఈ విషయంపై రూరల్ ఎస్సై జలంధర్‌రెడ్డిని వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో వస్తువులు ధ్వంసం

గట్టు, ఏప్రిల్ 30 : జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండల కేంద్రంలోని ఒకటవ అంగన్‌వాడీ కేంద్రంలో వస్తువులు ధ్వంసమయ్యాయి. మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు పట్టపగలే కేంద్రంలోకి చొరబడి వస్తు సామగ్రిని ధ్వంసం చేశారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు కేంద్రానికి వేసిన తాళం చెవిని విరగ్గొట్టి విధ్వంసానికి పాల్పడినట్లు అంగన్‌వాడీ టీచర్ వెంకట్రామమ్మ తెలిపారు. చిన్నారుల కోసం తీసుకొచ్చిన గుడ్లతో పాటు, బరువును చూసే యంత్రం, వారి కోసం ఉంచిన ఆట వస్తువులను ధ్వంసం చేసి పుస్తకాలను చిందరవందర చేశారు. గతంలో కూడా తాగునీటి కొళాయిని విరగ్గొట్టి కేంద్రంలోని మొక్కలను పీకేశారని గుర్తు చేశారు. ఈ విషయంపై ఆమె పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి కేంద్రాన్ని పరిశీలించి వెళ్లారని వెంకట్రామమ్మ తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

మల్దకల్, ఏప్రిల్ 30 : జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ ఎంపీడీవో కార్యాలయంలో మహిళా ఉద్యోగినిని వేధిస్తున్న ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని విఠలాపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు షేక్షావలి ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగికి అసభ్య పదజాలంతో వాట్సాప్ మెసేజ్‌లు చేస్తూ మానసికంగా వేధిస్తున్నాడు. ఉద్యోగిని మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు షేక్షావలిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మోట్లంపల్లి గ్రామంలో మద్యం పట్టివేత

ఆత్మకూరు, ఏప్రిల్ 30 : వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల పరిధిలోని మోట్లంపల్లి గ్రామంలో 24 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు అసిస్టెంట్ ఇంజనీర్ జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రత్యేక టీం ఆధ్వర్యంలో గ్రామాలలో తనిఖీలు చేయగా మోట్లంపల్లి గ్రామంలోని ఎద్దుల రాములు అనే వ్యక్తి కిరాణాన్ని నడుపుతున్నాడు. కిరాణం దగ్గకు వెళ్లి తనిఖీలు నిర్వహించగా గుట్టుచప్పుడు కాకుండా మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. నిర్వహించిన తనిఖీలలో 24 కింగ్‌ఫిషర్ బీర్లను స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేయాలని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఆయనతో పాటు ప్రత్యేక టీం సభ్యులు రాములు, పాషా, రమేష్‌లు పాల్గొన్నారు.

'పది' ఫలితాల్లో జిల్లాకు 32వ స్థానం

» గత ఏడాదితో పోల్చితే తగ్గిన ఉత్తీర్ణత » 83.97 శాతం ఉత్తీర్ణతతో బాలికలదే పైచేయి

- బాలురు 78.67 శాతం పాస్ - 25 పాఠశాలల్లో వంద శాతం పాస్



10/10 జీపీఏ సాధించిన విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులను అభినందిస్తున్న అదనపు కలెక్టర్

గద్వాల టౌన్, ఏప్రిల్ 30 : పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో గత ఏడాది రాష్ట్రంలో 27వ స్థానంలో ఉన్న జోగుళాంబ గద్వాల జిల్లా, ఈ ఏడాది 32వ స్థానానికి పడిపోయింది. జిల్లాలోని వివిధ యాజమాన్యాల పరిధిలోని మొత్తం 25 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించగా, 34 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించారు. మార్చి 18వ తేదీ నుంచి ఏప్రిల్ రెండవ తేదీ వరకు నిర్వహించిన పదవ తరగతి పరీక్ష ఫలితాలను మంగళవారం వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 7,175 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వారిలో 5,839 మంది (81.38 శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మిగిలిన 1,336 మంది ఫెయిల్ అయ్యారు. బాలుర విభాగంలో 3,512 మందికి గాను 2,763 (78.67 శాతం), బాలికల విభాగంలో 3,663 మందికి, 3,017 (83.97 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో ఉత్తీర్ణత శాతం తగ్గినట్లు అధికారులు వెల్లడించారు.

34 మందికి 10/10 జీపీఏ

జిల్లా వ్యాప్తంగా 34 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించారు. గద్వాల పట్టణంలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి మదన్, కేటీదొడ్డిలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల విద్యార్థులు నలుగురు, పుల్లూరు బాలికల గురుకులాల్లో ముగ్గురు, బిజ్వారం బాలికల గురుకులాల్లో ఒకరు 10/10 జీపీఏ సాధించారు. పట్టణంలోని విశ్వభారతి హైస్కూలుకు చెందిన విద్యార్థులు అత్యధికంగా ఎనిమిది మంది 10/10 జీపీఏ సాధించగా, దయానంద విద్యామందిర్, నోబుల్ హైస్కూల్, శ్రీచైతన్య హైస్కూలు విద్యార్థులు ఇద్దరు చొప్పున 10/10 జీపీఏ దక్కించుకున్నారు. మిగతా 10/10 జీపీఏ సాధించిన వారిలో పట్టణంలోని ఆగస్త్య పబ్లిక్ స్కూల్, ఇండో ఇంగ్లీష్ హైస్కూల్, కాకతీయ హైస్కూల్, ప్రగతి విద్యానికేతన్, శ్రీ సరస్వతి, సత్యసాయి, విశ్వేశ్వరయ్య మెమోరియల్ హైస్కూల్‌తో పాటు అయిజలోని బ్రైట్‌స్టార్ హైస్కూల్, లయోలా ఉన్నత పాఠశాల, అలంపూర్‌లోని గురుదేవ్ హైస్కూల్, శాంతినగర్‌లో శ్రీరామచంద్ర ఉన్నత పాఠశాలల్లో ఒక్కొక్కరు 10/10 జీపీఏ సాధించారు.

మండలాల వారీగా ఫలితాలు

పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 90.89 శాతంతో ఉండవల్లి మండలం అగ్రస్థానంలో నిలిచింది. 68.80 శాతంతో కేటీదొడ్డి మండలం చివరి స్థానంలో నిలిచింది. ఉండవల్లి మండలంలో 417 మందికిగాను 379 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, 38 మంది ఫెయిల్ అయ్యారు. కేటీదొడ్డిలో 391 మందికి, 269 మంది ఉత్తీర్ణులు కాగా, 122 మంది పాస్ కాలేదు. మల్దకల్‌లో 466 మందికి గాను, 329 మంది (70.60 శాతం) ఉత్తీర్ణులు కాగా, 137 మంది ఫెయిల్ అయ్యారు. ధరూరులో 562 మందికి, 404 మంది (71.89శాతం) మంది ఉత్తీర్ణులు కాగా, 158 మంది ఫెయిల్ అయ్యారు. గద్వాలలో 1,797 మందికి గాను 1,454 మంది (80.91శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. 343 మంది ఫెయిల్ అయ్యారు. అలంపూర్‌లో 462 మందికి గాను 402 మంది (87.01శాతం) మంది ఉత్తీర్ణులు కాగా, 60 మంది ఫెయిల్ అయ్యారు. గట్టులో 502 మందికి గాను 422 మంది (84.06శాతం) మంది ఉత్తీర్ణులు కాగా, 80 మంది ఫెయిల్ అయ్యారు. అయిజలో 1,049 మందికి గాను 882 మంది (84.08శాతం) మంది ఉత్తీర్ణులు కాగా, 167 మంది ఫెయిల్ అయ్యారు. ఇటిక్యాలలో 541 మందికి గాను 486 మంది (89.83శాతం) మంది ఉత్తీర్ణులు కాగా, 55 మంది ఫెయిల్ అయ్యారు. మల్దకల్‌లో 466 మందికి గాను 329 మంది (70.60 శాతం) మంది ఉత్తీర్ణులు కాగా, 137 మంది ఫెయిల్ అయ్యారు. మానవపాడులో 213 మందికి గాను 180 మంది (84.51శాతం) మంది ఉత్తీర్ణులు కాగా, 33 మంది పాస్ కాలేదు. రాజోలిలో 200 మందికి గాను 148 మంది (74శాతం) మంది ఉత్తీర్ణులు కాగా, 42 మంది పరీక్ష తప్పారు. వడ్డేపల్లిలో 575 మందికి గాను 484 మంది (84.17శాతం) మంది ఉత్తీర్ణులు కాగా, 91 మంది ఫెయిల్ అయ్యారు.

పోలీసు కుటుంబానికి ఆర్థిక భద్రత

» ఎనిమిది లక్షల రూపాయల చెక్కు అందజేత



ఏఎస్ఐ కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న ఎస్పీ రితిరాజ్

గద్వాల క్రైం, ఏప్రిల్ 30 : అనారోగ్యంతో మరణించిన పోలీస్ అధికారి కుటుంబ సభ్యులకు ఎస్పీ రితిరాజ్ మంగళవారం భద్రత ఎక్స్‌గ్రేషియా కింద ఎనిమిది లక్షల రూపాయల చెక్కును అందించారు. ఇటిక్యాల పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఏ.అయ్యన్న గత ఏడాది డిసెంబర్‌లో గుండెపోటుతో మరణించారు. ఆయన కుటుంబానికి భద్రత ఎక్స్‌గ్రేషియా కింద ఎనిమిది లక్షలు మంజూరు కాగా, మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధిత కుటుంబసభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. వారికి రావాల్సిన మిగిలిన బెనిఫిట్స్‌ను త్వరగా అందించేందుకు కృషి చేయాలని కార్యాలయ ఏవో సతీశ్‌కుమార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ నాగేంద్రకుమార్, ఏఎస్ఐ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు జెర్సీల పంపిణీ



క్రీడాకారిణులకు జెర్సీలను అందిస్తున్న బండల వెంకట్రాములు

గద్వాల అర్బన్, ఏప్రిల్ 30 : దివంగత రాజు సులోచన జ్ఞాపకార్థం ఆమె భర్త, సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు రాజారెడ్డి 20 మంది క్రీడాకారిణులకు జెర్సీలను పంపిణీ చేశారు. స్థానిక సోమనాద్రి ఫుట్‌బాల్ మినీ స్టేడియంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గద్వాల ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు బండల వెంకట్రాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారుడు రాజారెడ్డి భార్య సులోచన గత నెల గుండెపోటుతో హఠాన్మరణం చెందడం బాధాకరమని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని అన్నారు. భార్య జ్ఞాపకార్థం క్రీడాకారిణులకు జెర్సీలు అందించడం అభినందనీయమన్నారు. క్రమశిక్షణతో క్రీడల్లో రాణించి బాలికలు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బండల పాండు, ప్రవీణ్‌సేవా సమితి అధ్యక్షుడు ఇండికా శివ, సీనియర్ క్రీడాకారులు నరసింహరాజు, చక్ర, సతీష్, కిరణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి

» సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి



ఎన్నికల బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న నాయకులు

గద్వాల టౌన్, ఏప్రిల్ 30 : దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని, అందుకు ఇండియా కూటమికి అండగా నిలవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి పిలుపునిచ్చారు. బీజేపీతో పాటు ఆ పార్టీకి లోపాయికారిగా మద్దతునిస్తున్న బీఆర్ఎస్‌ను ఎన్నికల్లో తిరస్కరించాలని కోరారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో 'బీజేపీ బందీఖానా నుంచి దేశాన్ని విముక్తి చేద్దాం' అనే బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ దేశంలో పదేళ్ల క్రితం అధికార పగ్గాలు చేపట్టిన నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలపై వివక్ష చూపుతూ, సమాఖ్య స్ఫూర్తిని నీరుగార్చిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న బీజేపీకి ఎన్నికల్లో గుణపాఠం నేర్పాలన్నారు. నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం నుంచి కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న డాక్టర్ మల్లురవికి సంపూర్ణ మద్దతునివ్వాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వీవీ నరసింహ, ఉప్పేరు నరసింహ, మోషే, వెంకటన్న, మల్లి పాల్గొన్నారు.

నర్సరీని పరిశీలించిన డీఆర్‌డీవో



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో నర్సింగ్‌రావు

గద్వాల, ఏప్రిల్ 30 : మండల పరిధిలోని శెట్టి ఆత్మకూర్ గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహిస్తున్న నర్సరీని మంగళవారం సాయంత్రం డీఆర్‌డీవో నర్సింగ్‌రావు పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఎండ తీవ్రత నుంచి మొక్కలను కాపాడేందుకు గ్రీన్ నెట్ వేయాలని సూచించారు. వర్షాకాలం వరకు తగిన జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యవంతమైన మొక్కలను సిద్ధం చేయాలని నిర్వాహకుడు అనీల్‌కుమార్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో ఉమాదేవి, ఎంపీవో చెన్నయ్య ఏపీవో విజయలలిత ఉన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అధికారులు

వడ్డేపల్లి, ఏప్రిల్ 30 : మండల పరిధిలోని రామాపురం, జిల్లేడుదిన్నె గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఎంపీడీవో రమేష్, ఏపీవో కుమార్ పరిశీలించారు. చెరువుల్లో పూడికతీత పనులను తనిఖీ చేసి కూలీలతో మాట్లాడారు. కేటాయించిన కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉదయం తొందరగా పనులకు వచ్చి, త్వరగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

సమగ్ర విచారణ నిర్వహించాలి

గద్వాల టౌన్, ఏప్రిల్ 30 : మెడికల్ కళాశాలల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఎంపిక కోసం నిర్వహించనున్న లక్కీడిప్‌ను సమగ్ర విచారణ తర్వాతే చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డిగ్రీతో పాటు పీజీడీసీఏ అర్హతతో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ జారీ అయిందని తెలిపారు. కొందరు అనర్హులు పీజీడీసీఏకు సంబంధించిన నకిలీ ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకున్నట్లు ఆరోపణలున్నాయని పేర్కొన్నారు. ఈ విషయంపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

జములమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు





ప్రత్యేక అలంకరణలో జములమ్మ అమ్మవారు, దర్శనం కోసం తరలివచ్చిన భక్తులు

» అమ్మవారిని దర్శించుకున్న 30 వేల మంది

గద్వాల/ ఉండవల్లి, ఏప్రిల్ 30 : నడిగడ్డ భక్తుల ఇలవేల్పు జములమ్మ అమ్మవారి దర్శనానికి మంగళవారం మండుటెండను సైతం లెక్కచేయకుండా భక్తులు పోటెత్తారు. గద్వాలలో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యింది. అయినా భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దాదాపు 30 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ చైర్‌పర్సన్ కుర్వ గాయత్రి, ఈవో పురేందర్‌కుమార్ తెలిపారు. ఉక్కపోతతో ఇబ్బంది పడకుండా క్యూలైన్ల వద్ద కూలర్లు ఏర్పాటు చేయడంతో భక్తులు ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. రమ్య ఇండస్ట్రీస్ అధినేత కాంగ్రెస్ నాయకుడు బండ్ల రాజశేఖర్‌రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. వారిని ఆలయ అధికారులు సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందించారు. ఉండవల్లి మండల పరిధిలోని కంచుపాడు జములమ్మ ఆలయంలో మంగళవారం ఉదయం అమ్మవారికి పుష్పాలంకరణ చేశారు. అనంతరం విశేష పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలతో పాటు కర్నూలు, రాయచూరు ప్రాంతాలనుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సెలవులు ముగిసేలోపు మరమ్మతులు పూర్తి

» సమీక్షా సమావేశంలో కలెక్టర్ బీఎం సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, ఏప్రిల్ 30 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మరమ్మతు పనులను వేసవి సెలవులు ముగిసేలోపు పూర్తి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో చేపట్టాల్సిన నిర్మాణ పనులపై మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టాల్సిన పనులను గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. వచ్చే నెల మూడవ తేదీ నుంచి పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ వేగవంతంగా పనులు పూర్తి చేయాలన్నారు. పనుల పురోగతిపై వారాంతపు నివేదికలను తప్పనిసరిగా అందించాలని చెప్పారు. ఏమైనా సమస్యలు ఉంటే ఇప్పుడే చెప్పాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో ఏఏపీ కమిటీలతో పాటు, ప్రతీ మండలానికి నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. పాఠశాలల్లో తరగతి గదులకు తాత్కాలిక మరమ్మతులు, మరుగుదొడ్ల నిర్మాణం ఇతర పనులు చేపట్టాలన్నారు. తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులను పూర్తి చేయాలన్నారు. సమావేశానికి అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్, డీఆర్‌డీవో నర్సింగరావు, డీఈవో ఇందిర, ఎంఈవోలు, ఇంజనీరింగ్ అధికారులు హాజరయ్యారు.

విద్యుత్ కోతతో రిజిస్ట్రేషన్లు ఆలస్యం



రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయంలో వేచి ఉన్న రైతులు

» ఇబ్బంది పడుతున్న భూ క్రయ విక్రయదారులు

వడ్డేపల్లి, ఏప్రిల్ 30 : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో విద్యుత్ కోత కారణంగా రిజిస్ట్రేషన్లు ఆలస్యం అవుతున్నాయి. దీంతో గంటల తరబడి ఎదురుచూడాల్సి రావడంతో భూ క్రయ విక్రయదారులు అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు కావాల్సిన రిజిస్ట్రేషన్లు 12 గంటలకు కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు 15 రోజుల నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోందని వారు చెప్తున్నారు. కార్యాలయంలో ఇన్వర్టర్ కూడా లేకపోవడమేమిటని ప్రశ్నిస్తున్నారు. భూమి రిజిస్ట్రేషన్ కూడా దూర ప్రాంతాల నుంచి వచ్చిన తాము, ఇక్కడ పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి కార్యాలయంలో ఇన్వర్టర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. విద్యుత్ కోత వల్ల రిజిస్ట్రేషన్లు ఆలస్యమవుతున్న మాట వాస్తవమేనని తహసీల్దార్ శ్రీనివాస్ జోషి తెలిపారు. బడ్జెట్ లేకపోవడంతో ఇన్వర్టర్ ఏర్పాటు చేయలేదన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపి, ఇన్వర్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు

» బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

వడ్డేపల్లి, ఏప్రిల్ 30 : అన్నివర్గాల సంక్షేమ ఫలాలు అందించడం బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. నాగర్‌కర్నూల్ బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ తరఫున వడ్డేపల్లి మునిసిపాలిటీ పరిధిలోని పైపాడు గ్రామంలో మంగళవారం ఇంటింటి ప్రచారం చేశారు. పదేళ్ల పాలనలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శివ, మనోహర్ సంజి, యుగంధర్, పెద్దరాముడు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

» కేటీదొడ్డిలో ర్యాలీ

కేటీదొడ్డి, ఏప్రిల్ 30 : బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని, అక్షరాస్యతను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యుడు సభ్యుడు వెంకటేష్ అన్నారు. జాతీయ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని కేటీదొడ్డి మండల కేంద్రంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. మండలంలో ఆరు నుంచి 18 ఏళ్ల పిల్లలు 2,963 మంది వివిధ పనుల్లో ఉన్నారని తెలిపారు. బడి బయటి పిల్లల కోసం తమ సంస్థ ఆధ్వర్యంలో మండలంలో 50 కేంద్రాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. చిన్నారుల సామర్థ్యాన్ని బట్టి విద్యాబోధన చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ వెంకటేష్, కిరణ్, జయరాం, వీరన్న, పావని, రంగస్వామి పాల్గొన్నారు.

బీజేపీతో అవినీతి లేని పాలన

» నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ » శాంతినగర్‌లో రోడ్ షో



శాంతినగర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్న భరత్ ప్రసాద్, నాయకులు

వడ్డేపల్లి/ మానవపాడు, ఏప్రిల్ 30 : ముచ్చటగా మూడోసారి భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వస్తే అవినీతి లేని పాలన అందిస్తామని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మునిసిపాలిటీ కేంద్రమైన శాంతినగర్, మానవపాడు మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన రోడ్‌షోల్లో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారంలోని రాగానే మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు. అలంపూర్ నియోజకవర్గంలోని తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకంతో పాటు మూడు రిజర్వాయర్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. తనకు అవకాశం ఇస్తే వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేలా పార్లమెంట్‌లో మాట్లాడుతానని తెలిపారు. అంతకుముందు మానవపాడులో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి, మధు సూదన్‌గౌడ్, రామ కృష్ణ, పైపాడు వెంకటేశ్వర్లు, శివుడు, నరసింహులు, టీసీ రెడ్డి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

మాజీ సీఎంను కలిసిన తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు



మాజీ సీఎం చంద్రబాబుతో పూర్ణచంద్రారావు

వడ్డేపల్లి, ఏప్రిల్ 30 : ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును టీడీపీ సీనియర్ నాయకుడు పూర్ణచంద్రారావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసారు. వడ్డేపల్లి మండలం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు వాహనాల్లో తరలివెళ్లి ఆయనను కలిసి మాట్లాడారు. తన గెలుపు కోసం కర్నూలు జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో ప్రచారం చేయాలని చంద్రబాబు వారిని కోరారు. కార్యక్రమంలో నాయకులు చాణక్య, సాయిశేఖర్, ప్రసాద్, బజారన్న, నాగరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

ధరూరు, ఏప్రిల్ 30 : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు సత్యన్న, శ్రీనివాసులు, లాజర్, టైలర్ చిన్నతిమ్మప్ప, గోవర్ధన్, గోవింద్‌లు కాంగ్రెస్ నాయకుడు డీఆర్ శ్రీధర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి సరిత, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి మల్లురవి సమక్షంలో వారు పార్టీలో చేరగా, నాయకుడు తిరుపతయ్య కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో వినియోగదారుల ఫోరం మాజీ చైర్మన్ గట్టు తిమ్మప్ప, సీనియర్ నాయకులు అమరవాయి కృష్ణారెడ్డి, సత్యనారాయణ, లత్తిపురం వెంకట్రామిరెడ్డి, కృష్ణమూర్తి, ధరూరు కుర్వ శ్రీనివాసులు, హన్మంతు, అల్వాల రాజశేఖర్ రెడ్డి, పెద్దిడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.

రేపు పెద్దపాడులో అవగాహన సదస్సు

ధరూరు, ఏప్రిల్ 30 : ఎస్పీ ఆదేశాల మేరకు ధరూరు మండల పరిధిలోని పెద్దపాడు గ్రామంలో ఈ నెల రెండో తేదీ సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా డయల్ 100 ప్రాధాన్యం, బాల్యవివాహాలతో అనర్థాలు, ట్రాఫిక్ నియమాలు, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, సైబర్ నేరాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

తైక్వాండో విద్యార్థులకు బెల్టు పరీక్ష

అయిజ, ఏప్రిల్ 30 : పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం తైక్వాండో విద్యార్థులకు బెల్టు పరీక్షలు నిర్వహించారు. దాదాపు 100 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరచారు. చీఫ్ ఎగ్జామినర్‌గా తైక్వాండో రాష్ట్ర జనరల్ సెక్రటరీ మాస్టర్ శ్రీహరి వ్యవహరించారు. సీనియర్ మాస్టర్, అడ్వకేట్ మధుకుమార్, శ్రీనివాసులుశెట్టి, ఇన్‌స్ట్రక్టర్ సుధీర్ పర్యవేక్షించారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా బెల్టులు ప్రదానం చేశారు. క్రమశిక్షణతో సాధన చేసి భవిష్యత్తులో జాతీయ స్థాయికి ఎదగాలని మాస్టర్ శ్రీహరి ఆకాంక్షించారు.

భూమి ఆక్రమణకు యత్నం

» న్యాయం చేయాలని రైతుల వినతి

ఎర్రవల్లి, ఏప్రిల్ 30 : మండలంలోని సాసనూలు శివారులోని తమ భూమిని కొందరు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని, అధికారులు స్పందించి న్యాయం చేయాలని రైతులు బెల్ల జీవన్న, బెల్లనారాయణ, మద్దిలేటి, వెంకటమ్మతో పాటు మరికొందరు కోరారు. ఈ మేరకు మంగళవారం వారు తహసీల్దార్ ధరణిషాకు వినతిపత్రం ఇచ్చి, సమస్యను వివరించారు. సాసనూల్ గ్రామ శివారులోని 200 సర్వే నంబరులో తమకు వారసత్వంగా వచ్చిన ఐదు ఎకరాల రెండు గుంటల భూమి ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి తమకు సమాచారం లేకుండా తన పలుకుబడితో పట్టా మార్పు చేసుకొని దౌర్జన్యంగా తమ పొలాన్ని ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు స్పందించి విచారణ చేపట్టాలని, వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న తమకు న్యాయం చేయాలని కోరారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

» అలంపూర్ ఎంపీడీవో జబ్బార్

అలంపూర్, ఏప్రిల్ 30 : వృద్ధులు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎంపీడీవో జబ్బార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులు, వృద్ధులు ఇంటివద్ద, లేదా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయొచ్చని తెలిపారు. ఓటు వేయడం అందరి బాధ్యతని, ఓటు వేసేందుకు ఇతరుల సహాయం కూడా తీసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి రమేష్‌బాబు, సీడీపీవో సుజాత, డీపీఎం రూతమ్మ, ఏపీఎం ప్రవీణ, సీసీలు, వీఓఏలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.